సాక్షి
కర్నూలు
బుధవారం । 19 । మార్చి । 2025




దివ్యాంగులకు యూడీఐడీ

సదరం సర్టిఫికెట్లకు కేంద్ర ప్రభుత్వం స్వస్తి పలికింది. యూడీఐడీ (యూనిక్ డిజేబిలిటీ ఐడెంటిటీ కార్డు)ని అందించేందుకు వెబ్‌సైట్‌ను తీసుకువచ్చింది. 8లో▸



పాఠశాలల సమయం మార్పు

కర్నూలు కల్చరల్: పదోతరగతి పరీక్ష కేంద్రాలుగా ఉన్న పాఠశాలల సమయంలో స్వల్ప మార్పు చేసినట్లు డీఈఓ ఎస్.శామ్యూల్ పాల్ తెలిపారు. మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మార్చినట్లు పేర్కొన్నారు.



లాహిరి లాహిరి లాహిరిలో..

ఆళ్లగడ్డ: దిగువ అహోబిలంలో తెప్పోత్సవం మంగళవారం కనులపండువగా ముగిసింది. భారీగా తరలివచ్చిన భక్తులు కోనేటి చుట్టూ చేరుకుని తెప్పోత్సవాన్ని తిలకించారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:34	ఉ॥ 5:01
ఆదోని	సా॥ 6:33	ఉ॥ 5:00
నంద్యాల	సా॥ 6:30	ఉ॥ 5:01
ఆత్మకూరు	సా॥ 6:30	ఉ॥ 4:56
బనగానపల్లె	సా॥ 6:32	ఉ॥ 4:59

హదీస్ వెలుగు:

''ఆకలి దప్పికలు తెలిస్తేనే పేదల కష్టాలు తెలుస్తాయి. రోజాలు పాటించి ఉపవాసాలు ఉంటేనే మనిషి అహం తగ్గి ఆధ్యాత్మికం వైపు నడుస్తారు.''

– పవిత్ర ఖురాన్

'సహకారం' కొరవడి.. 'పరపతి' బజారునపడి!

రైతుల మెడపై జప్తుల కత్తి

- నష్టాల బాటన కేడీసీసీ బ్యాంకు
- కూటమి ప్రభుత్వ పాలనలో మళ్లీ చీకటి రోజులు
- ఇప్పటికే 90 మంది రైతుల ఆస్తులు స్వాధీనం
- 800 మంది ఆస్తుల వేలానికి రంగం సిద్ధం
- రికవరీ పేరిట రైతుల ఆత్మాభిమానంతో ఆటలు
- వైఎస్సార్‌సీపీ పాలనలో కేడీసీసీబీ లాభాల బాట
- నేడు నిరర్థక ఆస్తులే రూ.330 కోట్లు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(కేడీసీసీబీ) బకాయిలను రాబట్టుకునేందుకు రైతుల మెడపై జప్తుల కత్తి పెట్టింది. కూటమి ప్రభుత్వ ఆదేశాల మేరకు డీసీసీబీ రైతుల జీవితాలతో చెలగాటమాడుతోంది. రైతాంగాన్ని 2024–25లో అధిక వర్షాలు, అనావృష్టి పరిస్థితులు కోలుకోలేని దెబ్బతీశాయి. అంతంతమాత్రం పండిన పంటలకు కూడా గిట్టుబాటు ధరలు లేక నష్టాలను మూటకట్టుకున్నారు. ఈ పరిస్థితుల్లో జిల్లా సహకార కేంద్రబ్యాంకు రైతుల ఆస్తులు స్వాధీనం చేసుకునేందుకు సిద్ధమైంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచే రైతుల ఆస్తుల వేలానికి చర్యలను వేగవంతం చేయడం గమనార్హం. రుణాల రికవరీకి వెళ్లిన అధికారులు ఏది కనిపిస్తే దానిని స్వాధీనం చేసుకుంటుండటం పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

90 మంది రైతుల ఆస్తుల స్వాధీనం

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత డీసీసీబీ జప్తుల తీవ్రత మొదలైంది. 2014–15 నుంచి 2018–19 వరకున్న టీడీపీ ప్రభుత్వంలో వరుస కరువు రైతులను నిలువునా ముంచింది. పంటలు పండక రైతులు అల్లాడుతుంటే అప్పట్లో కూడా జప్తుల పర్వం కొనసాగింది. నాడు ఆస్తులను వేలం వేయడంతో పాటు రైతుల ఇళ్లలోని చరాస్తులను కూడా స్వాధీనం చేసుకున్నారు. తాజాగా కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో మళ్లీ నాటి పరిస్థితులే పునరావృతం అవుతున్నాయి. 2024 జూన్ 12న కూటమి ప్రభుత్వం ఏర్పాటైంది. నాటి నుంచి నేటి వరకు ఉమ్మడి కర్నూలు జిల్లాలో 90 మంది రైతుల ఆస్తులను డీసీసీబీతో పాటు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు స్వాధీనం చేసుకున్నాయి. 2024–25లో మొత్తం 800 మంది రైతుల ఆస్తులు వేలం వేయడం, స్వాధీనం చేసుకోవాలనేది లక్ష్యంగా తెలుస్తోంది. ఈ నెల చివరిలోపు రైతుల ఆస్తుల వేలానికి ముమ్మర కసరత్తు జరుగుతోంది. డీసీసీబీలో ప్రధానంగా ఆలూరు బ్రాంచీలో బకాయిలు అత్యధికంగా ఉన్నాయి. మరో రెండు, మూడు రోజుల్లో ఆలూరు ప్రాంతంలోని 18 మంది రైతుల ఆస్తులను స్వాధీనం చేసుకోవడానికి రంగం సిద్ధమైంది.

ముమ్మరంగా చరాస్తుల జప్తు

బకాయిలను రాబట్టుకునేందుకు ముందుగా రైతులకు సంబంధించిన చరాస్తులను జప్తు చేయాలని జాయింట్ కలెక్టర్, డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి చైర్మన్ నవ్య స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. చరాస్తుల జప్తు తర్వాత స్థిరాస్తుల వేలానికి శ్రీకారం చుట్టాలని ఆదేశించారు. జప్తులు, వేలంపాట, రికవరీలపై జేసీ ప్రతి రోజు డీసీసీబీ అధికారులతో టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షిస్తున్నారు. దీంతో అధికారులు జప్తుల పర్వాన్ని వేగవంతం చేయడం గమనార్హం. ఇప్పటికే ఆలూరు బ్రాంచి పరిధిలోని చిప్పగిరి మండలం ఏరూరు గ్రామంలో ట్రాక్టరు, బైకు.. కుందనగుర్తి గ్రామంలో ఒక బైకు, రామదుర్గం గ్రామంలో రెండు బైకులను జప్తు చేసినట్లు స్పష్టమవుతోంది.

వడ్డీ రూ.20 లక్షలు



చిప్పగిరి మండలం ఏరూరు గ్రామానికి చెందిన ఒక రైతు 2021లో కర్షక జ్యోతి కింద రూ.25 లక్షలు, దీర్ఘకాలిక రుణం కింద గొర్రెల పెంపకానికి రూ.15 లక్షల ప్రకారం మొత్తం రూ.40 లక్షల రుణం తీసుకున్నారు. వివిధ కారణాల వల్ల రుణాలను చెల్లించలేదు. నాలుగేళ్లలో వడ్డీ రూ.20 లక్షలు అయింది. మొత్తం రూ.60 లక్షలు చెల్లించాలని, లేకపోతే ఆస్తులు వేలం వేస్తామని నోటీసు జారీ చేశారు. ఇటీవల గ్రామానికి వెళ్లిన ప్రత్యేక టీమ్ రైతుకు చెందిన ట్రాక్టరును జప్తు చేసి బెల్డోణలోని పీఏసీఎస్‌కు స్వాధీనం చేశారు.



బైక్‌ను జప్తు చేశారు

చిప్పగిరి మండలం రామదుర్గం గ్రామానికి చెందిన ఒక మహిళ 2014లో దీర్ఘకాలిక రుణం కింద డెయిరీ లోన్ తీసుకున్నారు. కంతుల ప్రకారం కొంత మొత్తం కూడా చెల్లించారు. అసలు రూ.2.70 లక్షలు, అయితే ఇప్పుడు ఈ మహిళ చెల్లించాల్సిన మొత్తం వడ్డీతో కలిపి రూ.7 లక్షలు దాటింది. ఇటీవల గ్రామానికి వెళ్లిన రికవరీ టీమ్ ఈ మహిళ కుటుంబానికి చెందిన బైకును జప్తు చేసి సొసైటీకి తరలించింది. మహిళ తాకట్టు పెట్టిన స్థిరాస్తులను వేలంలో విక్రయించేందుకు రంగం సిద్ధం చేసింది.



రూ.330 కోట్లకు చేరుతున్న నిరర్థక ఆస్తులు

జిల్లా సహకార కేంద్ర బ్యాంకు నిరర్థక ఆస్తులు కొండలా పెరిగిపోతున్నాయి. 2024 ఏప్రిల్ నెలలో రూ.193 కోట్ల నిరర్థక ఆస్తులు ఉన్నాయి. ఈ నెల 15 నాటికి నిరర్థక ఆస్తులు రూ.267 కోట్లకు చేరుకోగా.. మార్చి చివరి నాటికి రూ.330 కోట్లకు చేరనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఆలూరు, డోన్, ఆదోని, పత్తికొండ, కృష్ణానగర్, కోడుమూరు, కోవెలకుంట్ల, నందికొట్కూరు, వెలుగోడు, ఆత్మకూరు బ్రాంచీల్లో నిరర్థక ఆస్తులు ఎక్కువగా ఉన్నట్లు స్పష్టమవుతోంది.



లాభాల బాట పట్టించిన వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం

నష్టాల ఊబిలో చిక్కుకున్న డీసీసీబీకి గత వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం ఊపిరిపోసింది. వివిధ ప్రభుత్వ కార్యక్రమాలకు కేడీసీసీబీ రుణాలు పంపిణీ చేసే ఏర్పాటు చేసింది. కస్టమ్స్ హయరింగ్ సెంటర్లు, మల్టీపర్పస్ గోదాముల నిర్మాణాలకు డీసీసీబీ రుణాలు అందచేసింది. గత ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల ఫలితంగా బ్యాంకు లోనింగ్ భారీగా పెరిగింది. వైఎస్‌ఆర్‌సీపీ హయాంలో దశాబ్దాల నాటి నష్టాలను అధిగమించి నికర లాభాల్లోకి వచ్చింది. 2022–23, 2023–24 సంవత్సరాల్లో రికార్డు స్థాయిలో ఏకంగా రూ.10కోట్ల లాభం ఆర్జించగా.. సభ్యులైన పీఏసీఎస్‌లకు రూ.4 కోట్లు డివిడెండ్ ఇచ్చింది. రాయలసీమ జిల్లాల్లోనే అత్యధిక టర్నోవర్ కలిగిన బ్యాంకుగా రెండేళ్లు వరుస అవార్డులను సొంతం చేసుకోవడం విశేషం.

➤ నికర లాభాల్లోకి వచ్చిన కేడీసీసీబీ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన మొదటి ఏడాదిలోపే మళ్లీ నష్టాల్లోకి వచ్చి బలహీనమైన బ్యాంకుగా రికార్డు నమోదు చేసుకోవడం ఆందోళన కలిగించే విషయం. గతంలో ఎప్పుడూ లేని విధంగా 2024–25లో రుణాల పంపిణీ నామమాత్రంగా చేపట్టారు. పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణ పేరుతో రైతులకు అవసరమైన రుణాల పంపిణీ విషయంలో కనీస చొరవ కరువైంది. ఇదే సమయంలో బకాయిలు పేరుకుపోవడంతో బ్యాంకు మళ్లీ నష్టాల బాట పట్టింది.

రికవరీలపై ప్రత్యేక దృష్టి

జిల్లా సహకార కేంద్రబ్యాంకు శాఖలు, పీఏసీఎస్‌ల నుంచి తీసుకున్న అన్ని రకాల రుణాలను గడువులోపు చెల్లించాలి. కొన్నేళ్ల క్రితం రుణాలు తీసుకున్న అనేక మంది రైతులు రుణాలు చెల్లించకుండా మొండికేశారు. ఇందువల్ల నిరర్థక ఆస్తులు పెరిగిపోతున్నాయి. ఈ నేపథ్యంలోనే రికవరీలపై ప్రత్యేక దృష్టి సారించాం. చరాస్తులను జప్తు చేయడంతో పాటు తనఖా పెట్టిన భూములను వేలం ద్వారా విక్రయించేందుకు చర్యలు చేపట్టాం.

– విజయకుమార్, సీఈఓ, కేడీసీసీ బ్యాంకు

న్యూస్‌రీల్

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి



మాట్లాడుతున్న జిల్లా జడ్జి జి. కబర్ధి

కర్నూలు: ఖైదీలు సత్ప్రవర్తనతో శిక్షను పూర్తి చేసి గౌరవప్రదమైన జీవితం గడపాలని న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ధి, కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి సూచించారు. మంగళవారం కర్నూలు శివారులోని పురుషుల కేంద్ర కారాగారం, మహిళా కారాగారాలను వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖైదీలకు న్యాయవాదులు లేకుంటే ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామన్నారు. ఖైదీలకు అందించే ఆహారం, రేషన్‌తో పాటు ఆరోగ్యం గురించి తీసుకుంటున్న చర్యలను తెలుసుకున్నారు. ఖైదీలను కోర్టు వాయిదాలకు కచ్చితంగా హాజరుపరచాలని జైలు అధికారులను ఆదేశించారు. ఏవైనా సమస్యలుంటే కర్నూలు న్యాయ సేవాధికార సంస్థను, లేదంటే లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100ను సంప్రదించాలని సూచించారు. కొందరు ఖైదీలు బెయిల్ మంజూరైనప్పటికీ జామీను దారులు లేక జైలులోనే ఉంటున్నామని జిల్లా జడ్జి దృష్టికి తీసుకురాగా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వైభవంగా సుయతీంద్రతీర్థుల పూర్వారాధన



పూజలు చేస్తున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

మంత్రాలయం: నవ మంత్రాలయ శిల్పి, రాఘవేంద్రస్వామి మఠం పూర్వపు పీఠాధిపతి సుయతీంద్రతీర్థులు పూర్వారాధన వేడుకలు వైభవంగా జరిగాయి. శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల నేతృత్వంలో మంగళవారం వేకువ జామున సుప్రభాత సేవతో వేడుకలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుత పీఠాధిపతి గురువులైన సుయతీంద్రతీర్థుల వేడుకలు శాస్త్రోక్తంగా చేపట్టారు. ముందుగా స్వామిజీ మూల బృందావనానికి నిర్మల్య విసర్జన గావించి పుష్ప, పంచామృతాభిషేకం చేపట్టి ప్రత్యేక పూలతో విశేష అలంకరణ గావించారు. వేడుకల్లో భాగంగా యాగ మంటపంలో సుయతీంద్రతీర్థుల ప్రశస్థితి భక్తులకు ప్రవచించారు.

పత్తికొండ కళాశాలకు ఏ గ్రేడు

పత్తికొండ రూరల్: పత్తికొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఏ గ్రేడు వచ్చినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ మాధురి తెలిపారు. పాణ్యం డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు డాక్టర్ ఎం.ఫరీదా బేగం, డోన్ డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ జి.చంద్రశేఖర్ అకడమిక్ ఆడిట్‌లో భాగంగా మంగళవారం కళాశాలను పరిశీలించారన్నారు. అకడమిక్ రిజిస్టర్లు, తరగతి గదులు, ప్రయోగశాలలు, కళాశాల మైదానంలో స్పోర్ట్స్, విద్యార్థులకు తాగునీటి సదుపాయం వంటి వాటిని పరిశీలించి సంతృప్తి చెందినట్లు తెలిపారు.

11 మంది ఎస్‌ఐలకు స్థానచలనం



కర్నూలు: జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న 11 మంది ఎస్‌ఐలకు స్థానచలనం కల్పిస్తూ ఎస్పీ విక్రాంత్ పాటిల్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలన సౌలభ్యంలో భాగంగా ఈ బదిలీలు చేపట్టినట్లు ఎస్పీ పేర్కొన్నారు. ఇందులో వీఆర్‌లో ఉన్న ఇద్దరికి పోస్టింగ్ దక్కగా, కర్నూలు త్రీటౌన్‌లో పనిచేస్తున్న మన్మథ విజయ్‌ను వీఆర్‌కు బదిలీ చేసి ఆస్పరి యూపీఎస్ స్టేషన్‌కు అటాచ్‌మెంట్ కింద నియమించారు.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
జి.హనుమంతరెడ్డి	వీఆర్ ఎస్పీ, కర్నూలు	కోసిగి పీఎస్
ఎస్.బాలనరసింహులు	హొళగుంద పీఎస్	కర్నూలు త్రీటౌన్ యూపీఎస్
జి.చంద్రమోహన్	కోసిగి పీఎస్	కర్నూలు త్రీటౌన్ యూపీఎస్
ఎం.కేశవ	కొత్తపల్లి పీఎస్ (నంద్యాల జిల్లా)	నందవరం పీఎస్
వి.శ్రీనివాసులు	నందవరం పీఎస్	డీసీఆర్‌బీ కర్నూలు
ఎ.రమేష్ బాబు	వీఆర్‌ఎస్పీ, కర్నూలు	కర్నూలు వన్‌టౌన్ యూపీఎస్
జె.మన్మథ విజయ్	కర్నూలు త్రీటౌన్ యూపీఎస్	వీఆర్, కర్నూలు (అటాచ్ టు ఆస్పరి యూపీఎస్)
ఎన్.సి.మల్లికార్జున	డీఎస్‌బీ, కర్నూలు	జొన్నగిరి పీఎస్
ఆర్.జయశేఖర్	జొన్నగిరి పీఎస్	ఆదోని త్రీటౌన్ యూపీఎస్
షేక్ మహబూబ్ బాషా	హొళగుంద పీఎస్ (డీఎస్‌బీ, కర్నూలు)	ఆలూరు పీఎస్
జి.దిలీప్ కుమార్	ఆలూరు పీఎస్	హొళగుంద పీఎస్

అక్రమార్కులను ఏమీ చేయ'లేఖ'

- 2014–19 మధ్య నీరు– చెట్టు పనుల్లో అవకతవకలు
- నిర్ధారించిన విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్
- టీడీపీ నేతల లేఖలతో చర్యల నిలుపుదల

కర్నూలు సిటీ: నీరు–చెట్టు పథకాన్ని 2014–19 మధ్య అప్పటి టీడీపీ నాయకులు ఆదాయ వనరుగా మార్చుకున్నారు. కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని ఇంజినీర్లతో కలిసి కొల్లగొట్టేశారు. నిబంధనల్లో అడ్డగోలుగా మార్పులు చేసి అవకతవకలకు పాల్పడినట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీల్లో నిర్ధారణ అయ్యింది. నివేదిక సమర్పించగా.. ఇంజినీర్లపై జలవనరుల శాఖ క్రమశిక్షణ చర్యలకు ఆదేశాలు జారీ చేసింది. అయితే విజిలెన్స్ నివేదిక ఆధారంగా ఇంజినీర్లపై చర్యలు నిలుపుదల చేయాలని కొందరు టీడీపీ నేతలు లేఖల రూపంలో విన్నవించారు. చర్యలు ఆపడంపై జలవనరుల శాఖలో చర్చ జరుగుతోంది.

అక్రమాలు ఇవీ..

నీరు–చెట్టు పథకం కింద కర్నూలు జిల్లాల్లో రూ.1421.31 కోట్ల విలువైన 14,345 పనులకు అంచనాలు వేశారు. ఇందులో రూ. 1106.84 కోట్ల విలువైన 12,596 పనులు సాంకేతిక అనుమతులు ఇచ్చి చేపట్టారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు 2016–17, 2018–19 పనులను తనిఖీ చేశారు. కర్నూలు జిల్లాలో రూ.23.22 కోట్లు విలువైన 233 పనులను తనిఖీలు చేయగా.. 161 పనుల్లో కొలతలు తేడాలు, 72 పనుల్లో భారీగా తేడాలు వచ్చాయి. మొత్తం రూ.14.71 కోట్ల రికవరీ చేయాలని నివేదిక ఇచ్చారు. అలాగే నంద్యాల డివిజన్ పరిధిలోని కేసీ కెనాల్ పరిధిలో నిర్వహించిన నీరు–చెట్టు పనుల్లో నిబంధనలు పాటించలేదని నివేదికలో పేర్కొన్నారు. అప్పటి జల వనరుల శాఖ కర్నూలు సర్కిల్ ఎస్‌ఈ, కేసీ కెనాల్ ఇద్దరు ఈఈలు, ఒక డీఈఈ, నలుగురు ఏఈఈలపై చార్జెస్ నమోదు చేసి, వ్యక్తిగత వివరణ ఇవ్వాలని ఆదేశించారు. అయితే ఆ పనుల బిల్లుల చెల్లింపుపై కొందరు కోర్టులను ఆశ్రయించడంతో వారిపై విచారణ జాప్యం అయ్యింది.

విచారణ బుట్టదాఖలు

గతేడాది జరిగిన సాధారణ ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి వచ్చిన వారం రోజులకే విజిలెన్స్ నివేదిక ఆధారంగా క్రమశిక్షణ చర్యలకు ఆదేశించారు. జలవనరుల శాఖ కర్నూలు ప్రాజెక్టు సీఈ ఎస్. కబీర్ బాషాను 2024 జూన్ 19న విచారణ అధికారిగాను, హంద్రీనీవా సుజల స్రవంతి పథకం సర్కిల్–1 పర్యవేక్షక ఇంజినీర్‌ను ప్రజెంటింగ్ ఆఫీసర్‌గా నియమించారు. అయితే విచారణ మొదలు పెట్టకముందే ప్రజెంటింగ్ ఆఫీసర్ బదిలీ అయ్యారు. అనంతరం నీరు–చెట్టు బిల్లుల చెల్లింపు, విజిలెన్స్ నివేదిక ఆధారంగా ఇంజినీర్లపై క్రమశిక్షణ చర్యలు నిలుపుదల చేయాలని సీఎం చంద్రబాబు నాయుడుకు, మంత్రులు లోకేష్, నిమ్మల రామానాయుడుకు టీడీపీ నేతలు లేఖల రూపంలో విన్నవించారు. ఈ మేరకే ఇంజినీర్లపై చర్యలు నిలిపి వేసినట్లు జల వనరుల శాఖలో చర్చ జరుగుతోంది.

విస్తుపోయే అంశాలు..

అప్పటి జల వనరుల శాఖ కర్నూలు సర్కిల్ ఎస్‌ఈ, కేసీ కెనాల్ ఇద్దరు ఈఈలు, ఒక డీఈఈ, నలుగురు ఏఈఈలపై చార్జెస్ నమోదు చేయడంతో పదోన్నతులు పొందలేకపోయారు. పదోన్నతులు పొందేందుకు తమపై ఉన్న చార్జెస్‌ను తొలగించుకునేందుకు 'కూటమి' నేతల ద్వారా కొందరు ప్రయత్నించారు. ప్రభుత్వంపై టీడీపీ నాయకులతో ఒత్తిళ్లు చేయించారు. దీంతో ఇంజినీర్లపై తదుపరి చర్యలు నిలిపివేస్తున్నట్లు ప్రభుత్వం ఇటీవలే ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులపై ఆ శాఖ ఇంజినీర్లే విస్తుపోతున్నారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ గతంలోనే ఇంజినీర్లపై చార్జెస్ నమోదు చేసిందని, ఇంత వరకు ఆ చార్జెస్‌ను తొలగించనే లేదని, టీడీపీ నాయకులు చేసిన నీరు–చెట్టు పనుల్లో అక్రమాలు ఉన్నా చర్యలు వెనక్కి తీసుకోవడంపై జలవనరుల శాఖలో చర్చ జరుగుతోంది.

మత్తు పదార్థాలను సమష్టిగా నిర్మూలిద్దాం



మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో గంజాయి సాగు, మత్తు పదార్థాల రవాణా, వినియోగాన్ని సమష్టి కృషితో నిర్మూలిద్దామని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులకు పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నార్కోటిక్స్ కోఆర్డినేషన్(ఎన్‌సీఓఆర్‌డీ) సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మత్తు పదార్థాలతో కలిగే అనార్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మత్తు పదార్థాల వినియోగం, రవాణాపై ప్రజలు కూడా సమాచారం అందించాలని కోరారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరం నుంచి మత్తు పదార్థాల వినియోగంతో కలిగే అనార్థాలపై పాఠశాలల్లో వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించాలన్నారు. ప్రజలకు అవగాహన కోసం ర్యాలీలు నిర్వహించాలని, ప్రతిజ్ఞలు చేయించాలని డీఈఓను కోరారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లాకల్యాణి, జిల్లా వ్యవసాయాధికారి వరలక్ష్మీ, డీఈఓ శామ్యూల్‌పాల్, ఆర్‌టీసీ ఆర్‌ఎం శ్రీనివాసులు, అదనపు మునిసిపల్ కమిషనర్ ఆర్జీవీ కృష్ణ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్ కుమార్ పాల్గొన్నారు.

ధరలు నిరాశాజనకం

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు మార్కెట్‌లో వివిధ పంట ఉత్పత్తులకు ధరలు నిరాశాజనకంగా ఉండటంతో రైతులు దిగాలు చెందుతున్నారు. ఎండుమిర్చి, వాము, ఉల్లి, కందులు, శనగల ధరలు నేలచూపు చేస్తున్నాయి.

- ➡ వాము 419 క్వింటాళ్లు మార్కెట్‌కు వచ్చింది. కనిష్ట ధర రూ.1,009, గరిష్ట ధర రూ.25,159 లభించింది. సగటు ధర రూ.16730 నమోదైంది.
- ➡ మిర్చిలో రకాల వారీగా ధరలు వేస్తున్నారు. మిర్చి ఎరుపు రకానికి గరిష్టంగా రూ.12,811, బ్యాడిగ రకానికి రూ.11,501, తేజ రకానికి రూ.11,631 ధర లభించింది.
- ➡ ఉల్లికి గరిష్టంగా రూ.1,591 ధర మాత్రమే దక్కింది.
- ➡ వివిధ పంటల్లో గరిష్ట ధర ఒకటి, రెండు లాట్లకు మాత్రమే ఎక్కువగా ఉంటోంది. మిగిలిన లాట్లకు అంతంతమాత్రం ధరనే లభిస్తోంది.

దాహం బిందెలకెరుక!



బడి దేవుడెరుగు: ఇంటికి తాగునీరు మోసుకెళ్తున్న విద్యార్థిని

ఈ దృశ్యాలు ఎక్కడో మారుమూల ప్రాంతాల్లోని తాగునీటి సమస్య అనుకుంటే పొరపాటు. నగర నడిబొడ్డున గణేష్‌నగర్‌లో తాగునీటి పాట్లు ఇవీ. నాలుగైదు రోజులకోసారి వచ్చే ట్యాంకు కోసం ఇక్కడి ప్రజలు అన్ని పనులు మానుకొని ఎదురుచూస్తున్నారు. వచ్చినప్పుడే ఇంట్లోని బిందెలన్నింటినీ వరుసపెట్టి కుస్తీలు పడుతున్నారు. పిల్లలు బడి మానుకొని బిందెలు మోస్తుంటే, పెద్దలు కూలి పనులకు వెళ్లకుండా గుక్కెడు నీటికి చుక్కలు చూస్తున్నారు. మండుటెండను సైతం లెక్క చేయకుండా దాహం తీరితే చాలనుకొని కాళ్లు కాలుతున్నా బిందెలతో ట్యాంకు వద్దకు పరుగులుతీస్తున్న దృశ్యాలు 'కన్నీళ్లు' తెప్పించక మానవు. ఇక్కడొక్కటే కాదు.. నగరంలోని చాలా ప్రాంతాలు, శివారు కాలనీల్లో ఇదే పరిస్థితి కనిపిస్తోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



ట్యాంకు మళ్లీ ఇప్పుడొస్తుందో: ఇంటికి సరిపడా బిందెలతో మహిళ



మండుటెండలో నిరీక్షణ: ట్యాంకు కోసం ఎదురు చూస్తున్న కాలనీవాసులు



మా వంతు ఎప్పుడో: ట్యాంకు వద్ద ఎండలో నీటిపాట్లు

క్లుప్తంగా

మొసలి మృతి



నందవరం: నాగలదిన్నె – మంత్రాలయం ప్రధాన రహదారిలోని పెద్దకొత్తిల్లి గ్రామ సమీపంలో ఓ మొసలి మృతి చెందింది. తుంగభద్ర నది నుంచి పంట పొలాల మీదుగా రహదారిపైకి వచ్చిన మొసలి రాత్రి గుర్తు తెలియని వాహనం కింద పడి మృత్యువాత పడినట్లు తెలుస్తోంది.

యువకుడి అనుమానాస్పద మృతి



వెంకటేష్ (ఫైల్)

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలో ఓ యువకుడు మంగళవారం అనుమానాస్పదంగా మృతి చెందాడు. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక ఎంఎస్ నగర్ వీధికి చెందిన వెంకటేష్ శుభకార్యాల కు వంటల కాంట్రాక్ట్ ఒప్పుకుని కుటుంబాన్ని పోషించేవాడు. వెంకటేష్ టీచర్స్ కాలనీలో ఉంటున్న వాణి అనే యువతిని ప్రేమించి పెద్దల అంగీకారంతో గతేడాది డిసెంబర్ 31వ తేదీన వివాహం చేసుకున్నాడు. సంసారం సాఫీగా సాగుతున్న నేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత వెంకటేష్ బెడ్‌రూమ్‌లోకి వెళ్లి నిద్రపోయాడు. కొన్ని గంటల తర్వాత భార్య వెళ్లి చూడగా అతను అపస్మారక స్థితిలో కనిపించాడు. మెడకు గాయమైనట్లు గుర్తించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. అయితే అప్పటికే వెంకటేష్ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆసుపత్రి వద్దకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతికి కారణాలు విచారణలో తెలుస్తాయన్నారు.



ఎండకు రక్షణగా చున్నీలు కప్పుకుని వెళ్తున్న ఇందిరాగాంధీ మెమోరియల్ పాఠశాల విద్యార్థినులు

ఎండా కాలం.. జర భద్రం



గొడుగు రక్షణగా..

రోజురోజుకు సూర్యుడు భయపెడుతున్నాడు. ఇంటి నుంచి అడుగు బయట పెట్టాలంటే ఆలోచించాల్సి వస్తోంది. అయినా చదువులు, ఉద్యోగాలు, పనులు ఉన్న వారు తప్పక రావాల్సి వస్తోంది. అయితే వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. జిల్లాలో 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ప్రస్తుతం ఒంటి పూట బడులు కావడంతో విద్యార్థులు మధ్యాహ్నం ఇంటికి చేరుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. చిన్న చిన్న జాగ్రత్తలు తీసుకుంటూ ఇంటి దారి పడుతున్నారు. బాలికలు చున్నీలను కప్పుకొని రక్షణ పొందుతున్నారు. మరి కొందరు గొడుగులతో వెళ్తున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



పిల్లలను గొడుగు నీడలో తీసుకెళ్తూ..

సూర్య @ 42.7 డిగ్రీలు

- పెద్ద దేవళాపురంలో అత్యధిక ఉష్ణోగ్రత నమోదు
- కల్లూరులో 42.6 డిగ్రీలు నమోదు
- వడగాల్పులతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి



కర్నూలు(అగ్రికల్చర్): మార్చి నెలలోనే ఉష్ణోగ్రతలు గరిష్ట స్థాయికి చేరుతున్నాయి. మంగళవారం మధ్యాహ్నం 4 గంటల సమయంలో రాష్ట్రంలోనే ఉమ్మడి కర్నూలు జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఒకవైపు సుర్రుమంటున్న ఎండలు, మరోవైపు వడగాల్పులతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. అయితే ఎండల నుంచి ప్రజలకు కొంతైనా ఉపశమనం కల్పించేందుకు జిల్లా యంత్రాంగం ఏ మాత్రం చొరవ తీసుకోవడం లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉన్న ఐదేళ్లు కర్నూలు నగరంలోని ప్రధాన కూడళ్లలో చలువ పందిళ్లు ఏర్పాటు చేసింది. 2024లో ఫిబ్రవరి నెల చివరి నాటికే చలువ పందిళ్లు ఏర్పాటు అయ్యాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత చలువ పందిళ్లు, చలి వేంద్రాల జాడ కనిపించడం లేదు.

బండిఆత్మకూరు మండలంలో 42.7 డిగ్రీల ఉష్ణోగ్రత...

రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు ఉమ్మడి కర్నూలు జిల్లాలోనే నమోదు అవుతున్నాయి. బండి ఆత్మకూరు మండలం పెద్ద దేవళాపురం గ్రామంలో 42.7 డిగ్రీలు, కల్లూరులో 42.6, చాగలమర్రిలో 42.4 డిగ్రీలు, గోస్పాడులో 41.9, దొర్నిపాడులో 41.7, ఆత్మకూరులో 41.5, కొత్తపల్లిలో 41.4, కోడుమూరులో41.2, కోసిగిలో 41.2, పెద్దకడుబూరులో 41.1 కర్నూలులో 40.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైంది. సాధారణం కంటే రెండు, మూడు డిగ్రీల అత్యధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రానున్న రోజుల్లో వడగాల్పులు, ఉష్ణోగ్రతల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ప్రకటించింది. మార్చి నెలలోనే ఉష్ణోగ్రతలు గతంలో ఎపుడూ లేని విధంగా 44 డిగ్రీలను అధిగమించే ప్రమాదం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రజలు వడదెబ్బకు గురి కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు సూచిస్తున్నారు.

శనగల కొనుగోలుకు నాఫెడ్ శ్రీకారం

కర్నూలు(అగ్రికల్చర్): 2024–25 రబీ సీజన్‌లో పండించిన శనగలను మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు నాఫెడ్ శ్రీకారం చుట్టింది. మద్దతు ధర రూ.5,650 ఉండగా.. మార్కెట్‌లో ధర రూ.5వేలకు పడిపోయి రైతులు నష్టపోతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాల్లేవు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ నాఫెడ్ శనగ కొనుగోళ్లు చేపట్టింది. జిల్లాలో 6,848 టన్నుల వరకే మాత్రమే కొనుగోలుకు నాఫెడ్ అనుమతిచ్చింది. మంగళవారం ఆలూరు, తుగ్గలి, దేవనకొండ, ఆదోని మండలాల్లో కొనుగోళ్ల ప్రక్రియ మొదలైంది. ఆలూరు మండలం హత్తిబెళగల్ గ్రామంలో జాయింట్ కలెక్టర్ బి.నవ్య శనగల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఇదిలాఉండగా వైఎస్ఆర్‌సీపీ పాలనలో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆర్‌బీకే వారీగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి అన్ని పంటలను మద్దతు ధరతో కొనుగోలు చేయడం విశేషం. కూటమి ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను కుదించడంతో రైతులు మద్దతు ధరతో అమ్ముకోవడం ఇబ్బందికరంగా మారింది. శనగలను తగిన నాణ్యత ప్రమాణాలతోనే తీసుకురావాలని మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ జి.రాజు తెలిపారు.

ఎక్సైజ్ శాఖలో పదోన్నతుల పండుగ

- సీమ జిల్లాల్లో పదోన్నతి పొందనున్న 48 మంది హెచ్‌సీలు, క్లర్కులు
- ఈనెల 20, 21 తేదీల్లో క్లర్కులకు దేహదారుఢ్య పరీక్షలు

కర్నూలు: ఎక్సైజ్ శాఖలో పదోన్నతుల పండుగ మొదలవుతోంది. హెడ్ కానిస్టేబుళ్లు, క్లర్కుల సీనియారిటీ జాబితా రూపొందించడంలో తీవ్ర జాప్యం జరిగి వివాదంలో చిక్కుకున్న పదోన్నతి వివాదంపై డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి చొరవ చూపడంతో చకాచకా ఫైలు కదులుతోంది. ఫోర్త్‌జోన్ పరిధిలో మొత్తం 52 పోస్టులు ఖాళీగా ఉండగా 48 హెడ్ కానిస్టేబుల్, క్లర్కులకు అడ్‌హాక్ పద్ధతిలో ఎస్‌ఐలుగా పదోన్నతి కల్పించి పోస్టింగులు కేటాయించాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డైరెక్టర్ నుంచి ఇటీవల జిల్లా కేంద్రానికి ఉత్తర్వులు అందాయి. ఆ మేరకు డిప్యూటీ కమిషనర్ చొరవ తీసుకున్నారు. గ్రూప్–2కు పోస్టులే అయినా అడ్‌హాక్ పద్ధతిలో పదోన్నతికి రంగం సిద్ధమైంది.

సీమ జిల్లాల్లో ఖాళీల జాబితా సిద్ధం

ఫోర్త్ జోన్ పరిధిలో ఎక్కడెక్కడ ఎస్‌ఐ పోస్టులు ఖాళీ ఉన్నాయనే వివరాలను డిప్యూటీ కమిషనర్ ఆయా జిల్లాల ఈఎస్‌లు, ఏసీలకు లేఖ రాసి తెప్పించుకున్నారు. అలాగే హెడ్ కానిస్టేబుళ్లు, క్లర్కులకు ఎస్‌ఐలుగా పదోన్నతులు కల్పించేందుకు అర్హత ఉన్న వారి వివరాలతో పాటు వారి ఎస్‌ఆర్‌లను తెప్పించుకుని జాబితా రూపొందించారు. ఈనెల 20, 21 తేదీల్లో క్లర్కులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించేందుకు తూనికలు, కొలతల శాఖ అధికారులకు డిప్యూటీ కమిషనర్ లేఖ రాశారు. సీమ జిల్లాల్లో 12 మంది క్లర్కులు ఎస్‌ఐలుగా పదోన్నతి పొందేందుకు జాబితా సిద్ధమైంది. వైద్యపరీక్షల అనంతరం పదోన్నతి కల్పించి ఈ నెలాఖరులోగా పోస్టింగులు కేటాయించే అవకాశమున్నట్లు ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు.

దాహం తీర్చుకునేందుకు వెళ్లి..

- ఎల్లెల్సీలో పడి మహిళా కూలీ మృత్యువాత



శ్రీదేవి (ఫైల్)

హాలహర్వి: వ్యవసాయ పనులకు వెళ్లిన ఓ మహిళా కూలీ ప్రమాదవశాత్తు ఎల్లెల్సీ కాల్వలో పడి మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఆలూరు మండల మొలగవల్లి గ్రామానికి చెందిన శ్రీదేవి(40) మంగళవారం గూళ్యం గ్రామానికి చెందిన ఓ రైతు మిరప పంట కోసేందుకు తోటి కూలీలతో కలసి వెళ్లింది. మధ్యాహ్నం ఇంటికి తిరిగి వస్తూ పచ్చారపల్లి వద్ద నీళ్లు తాగేందుకు ఎల్లెల్సీ కాలువలోకి దిగింది. ప్రమాదవశాత్తు కాలు జారి శ్రీదేవి కాలువలో పడిపోయింది. పక్కనే ఉన్న ఆటో డ్రైవర్ మునిస్వామి రక్షించే ప్రయత్నం చేసినా ఫలించలేదు. సమాచారం అందుకున్న హాలహర్వి ఎస్ఐ చంద్ర వెంటనే ఫైర్ స్టేషన్ సిబ్బంది, గజ ఈతగాళ్లను పిలిపించి గాలింపు చర్యలు చేపట్టారు. గూళ్యం 48వ డీప్ సమీపంలో మృతదేహాన్ని గుర్తించి బయటకు తీశారు. మృతురాలికి భర్త భగీరథ, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చంద్ర తెలిపారు.

రెండు బైక్‌లు ఢీకొని..

- వృద్ధుడి మృతి
- యువకుడికి తీవ్ర గాయాలు



బోయ హనుమన్న (ఫైల్)

పత్తికొండ రూరల్: అతి వేగం ఓ నిండు ప్రాణాన్ని బలిగొంది. టిఫిన్ చేసేందుకు హోటల్ వెళ్లిన వృద్ధుడు తిరిగిరాని లోకాలకు చేరాడు. పత్తికొండ పట్టణంలో మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందగా, మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానిక దాసరి వీధిలో బోయ హనుమన్న, తిమ్మక్కలు నివాసముంటున్నారు. వారి కుమారుడు భార్యా పిల్లలతో బతుకుదెరువుకు గుంటూరు వలస వెళ్లారు. ఇంటి వద్ద వున్న తిమ్మక్క మంగళవారం మిరపకాయలు తెంపేందుకు కూలికి వెళ్లగా.. హనుమన్న టిఫిన్ చేసేందుకు టీవీఎస్ ఎక్స్‌ఎల్ వాహనంపై ప్రభుత్వ బీసీ హాస్టల్ సమీపంలోని ప్రధాన రోడ్డు పక్కనే ఉన్న హోటల్‌కు వెళ్లాడు. టిఫిన్ చేసిన తర్వాత ఇంటికి వచ్చేందుకు వాహనాన్ని తీస్తుండగా పత్తికొండకు చెందిన కూరగాయల వ్యాపారి అభిరాం పల్సర్ బైక్‌తో వేగంగా వచ్చి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇద్దరిని హుటాహుటిన స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా కోలుకోలేక వృద్ధుడు మృతి చెందాడు. యువకుడు అభిరాం చికిత్స పొందుతున్నాడు. భర్త మృతితో భార్య తిమ్మక్క రోదిస్తున్న తీరు పలువురిని కలిచివేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అన్నదానం పేరుతో అక్రమ వసూళ్లు

- కాశినాయన ఆశ్రమమంటూ విరాళాల సేకరణ
- రాజమండ్రి పోలీసులకు చిక్కిన వెలుగోడు ముఠా



పోలీసుల అదుపులో నిందితులు

ఆత్మకూరురూరల్: అన్నదానం పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ముఠా పోలీసులకు పట్టుబడింది. వెలుగోడు మండలానికి చెందిన నిందితులు కర్ణాటక, తమిళనాడుతో పాటు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో కాశిరెడ్డి నాయన పేరిట నిత్యాన్నదానం చేస్తున్నామని, శ్రీశైలంలో ఒక వసతి గృహం నిర్మిస్తున్నామని నమ్మబలుకుతూ లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్న విషయాన్ని రాజమండ్రి పోలీసులు బట్టబయలు చేశారు. వెలుగోడు మండల కేంద్రంలో నివసించే శంకర్ అనే వ్యక్తి శంకర్ రెడ్డి, భవనం రమణారెడ్డి అనే పేర్లతో చెలామణి అవుతూ దాదాపు లక్షలాది రూపాయలు సేకరించినట్లు తెలుస్తోంది. ఇతను అతని కులస్తులను కొందరిని తన ముఠాలో చేర్పించుకుని ఖరీదైన దుస్తులు, వేషధారణతో వాహనాల్లో తిరుగుతూ పలు ప్రాంతాల్లో విరాళాలు సేకరించారు. వీరు రెండు రోజుల క్రితం రాజమండ్రిలో తాము ఆత్మకూరు మండలం నల్లకాల్వ గ్రామంలో వైఎస్సార్ స్మృతివనం సమీపంలో కాశిరెడ్డి నాయనం ఆశ్రమం ఏర్పాటు చేశామని, అక్కడ నిత్యాన్నదానం జరుగుతుందని చెబుతూ.. చందాలు వసూలు చేసే యత్నం చేశారు. వీరి పోకడ గమనించిన రాజమండ్రికి చెందిన త్రినాథరెడ్డి అనే వ్యక్తి ఈ ముఠాను పోలీసులకు అప్పగించి ఫిర్యాదు చేశారు. ఇంతకు ముందు నంద్యాల ఎస్పీగా పని చేసిన రఘువీరారెడ్డి అక్కడ ఉండడంతో ఆయన ఈ విషయంపై విచారణ జరిపించారు. దీంతో శంకర్ ముఠా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు తేలడంతో వారిపై కేసు నమోదు చేశారు. వారి వద్ద ఉన్న రసీదు పుస్తకాలు, డిజిటల్ లావాదేవీలను పరిశీలిస్తే ఈ మధ్య కాలంలోనే రూ. 20 లక్షలకు పైగా వసూలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. శంకర్ ముఠాలో వెలుగోడు మండలం రేగడగూడూరు గ్రామానికి చెందిన వారు కూడా ఇద్దరు ఉన్నట్లు తెలిసింది. నల్లకాల్వలో కాశిరెడ్డి నాయన ఆశ్రమం ఉన్న విషయం నిజమే అయినప్పటికీ ఈ ఆశ్రమ నిర్వాహకులు వేరే వారు కావడం గమనార్హం. ఇందులో వారు ప్రచారం చేసుకుంటున్నంత స్థాయిలో అన్నదాన కార్యక్రమాలు జరగడం లేదు.

గవర్నర్‌కు లోకాయుక్త వార్షిక నివేదిక



గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు నివేదికను సమర్పిస్తున్న ఉప లోకా యుక్త జస్టిస్ రజని

కర్నూలు(సెంట్రల్): ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త వార్షిక నివేదిక–2024ను గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు సోమవారం సమర్పించినట్లు ఉపలోకాయుక్త జస్టిస్ పి.రజని వెల్లడించారు. మంగళవారం ఆమె కర్నూలులోని లోకాయుక్త ఆఫీసులో వార్షిక నివేదికలో పొందుపరచిన వివిధ అంశాలపై కూలంకషంగా వివరించారు. ఏపీ లోకాయుక్త చట్టంలోని సెక్షన్ 12(5) ప్రకారం ఆంధ్రప్రదేశ్ గవర్నర్‌కు వార్షిక నివేదికను సమర్పించినట్లు చెప్పారు. నివేదికలో ప్రజా విశ్వాసం పెంపుదల, ఫిర్యాదులకు పరిష్కారాలు చూపడం, చెల్లింపుల పునరుద్ధరణ, పర్యావరణ, భూమస్యలపై క్రియాశీల చర్యలు, ల్యాండ్ రికార్డు మేనేజ్‌మెంట్‌లో పారదర్శకతను పెంచడం, అవినీతి, అక్రమాలకు పాల్పడిన ప్రభుత్వ ఉద్యోగులపై చట్టపరమైనచర్యలు, లోకాయుక్త చట్టంపై పౌరులకు అవగాహన పెంపు తదితర అంశాలను పొందుపరచినట్లు వెల్లడించారు.

ఎస్సీ వర్గీకరణతో మాల, మాదిగలకు నష్టమే

- ఏపీ ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోన నాగరాజు



సమావేశంలో మాట్లాడుతున్న గోన నాగరాజు

కర్నూలు(అర్బన్): రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ నివేదికల ఆధారంగా ఎస్సీ వర్గీకరణను జిల్లా యూనిట్, రాష్ట్ర యూనిట్‌గా చేసినా.. రాష్ట్రంలోని మాల మాదిగలకు నష్టం జరుగుతుందని ఏపీ ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోన నాగరాజు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం సాయంత్రం స్థానిక కార్యాలయంలో సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్‌సీహెచ్ బజారన్నతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ వర్గీకరణను జిల్లా యూనిట్‌గా విద్యా, ఉద్యోగాల్లో మూడు కేటగిరీలుగా వాటాలు చేస్తామని ప్రకటించిందన్నారు. అయితే ఏకసభ్య కమిషన్ వర్గీకరణను ఏ, బీ, సీ కేటగిరీలుగా విభజించి అమలు చేసేందుకు రాష్ట్రం యూనిట్‌గా చేయనున్నట్లు ప్రకటించారన్నారు. ఈ నేపథ్యంలోనే ఏ కేటగిరీలోని రెల్లి, ఉపకులాలకు 1 శాతం, బీ కేటగిరీలోని మాదిగ, ఉపకులాలకు 6.50 శాతం, సీ కేటగిరిలోని మాల, ఉపకులాలకు 7.50 శాతం రిజర్వేషన్ ప్రతిపాదిస్తు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికలు అందించిందన్నారు. ఏ విధంగా వర్గీకరణ చేపట్టినా రాష్ట్రంలో 2011 జనాభా లెక్కల ప్రకారం ఉమ్మడి అనంతపురం, కర్నూలు, ప్రకాశం, గుంటూరు, కృష్ణా జిల్లాల్లో మాలలకు, వైఎస్సార్, చిత్తూరు, నెల్లూరు, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో మాదిగలకు నష్టం జరుగుతుందన్నారు. జిల్లా యూనిట్‌గా అమలు చేసినా ఎస్సీ జాబితాలోని 59 ఉప కులాలు భారీగా విద్య, ఉద్యోగాలను కోల్పోతారన్నారు. ఈ అంశంపై ఈ నెల 20న అసెంబ్లీలో చర్చ జరిగిన అనంతరం రాయలసీమలోని మేధావులను కలిసి ఎస్సీలకు ఎలాంటి నష్టం జరగకుండా నేషనల్ ఎస్సీ కమిషన్‌ను కలిసి వివరించనున్నట్లు తెలిపారు.

ప్రశాంతంగా ఏఎన్‌ఎంల పదోన్నతి కౌన్సెలింగ్




ఆర్డర్ కాపీని అందజేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ పి. శాంతికళ, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు(హాస్పిటల్): సచివాలయాల్లో పనిచేసే ఏఎన్‌ఎం–3లకు ఎంపీహెచ్‌ఏ–ఎఫ్‌గా పదోన్నతి కల్పించారు. ఈ మేరకు వీరికి కర్నూలు మెడికల్ కాలేజీలోని నూతన ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కౌన్సెలింగ్ నిర్వహించి స్థానాలు కేటాయించారు. కౌన్సెలింగ్‌లో స్థానం పొందిన వారికి డీఎంహెచ్‌వో డాక్టర్ పి. శాంతికళ, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు ఆర్డర్ కాపీలు అందజేశారు. కర్నూలు, నంద్యాల జిల్లాల పరిధిలో 172 మందికి కౌన్సెలింగ్ నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి. శాంతికళతో పాటు ఏవో అరుణ, సూపరింటెండెంట్ పి. శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్ మధుసూదన్‌లు కౌన్సెలింగ్ నిర్వహించి స్థానాలు కేటాయించారు.

దివ్యాంగులకు యూడీఐడీ

- కొత్త పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చిన కేంద్ర ప్రభుత్వం
- 21 రకాల సేవలు సులువుగా పొందే అవకాశం



యూడీఐడీ కార్డు నమూనా

కర్నూలు(అర్బన్): దివ్యాంగులకు కేంద్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు, ఇతరత్రా సేవలకు సదరం స్థానంలో యూడీఐడీ (యూనిక్ డిజేబిలిటీ ఐడెంటిటీ కార్డు)ని అందించనుంది. దివ్యాంగులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే చేయూత, ఇతర ప్రయోజనాలకు ఇప్పటి వరకు సదరం సర్టిఫికెట్ తప్పనిసరి. దీని కోసం దివ్యాంగులు గ్రామ సచివాలయాలు, మీ సేవా కేంద్రాల్లో సదరం శ్లాట్ బుక్ చేసుకుంటే ప్రభుత్వం నిర్దేశించిన వైద్య శిబిరంలో వైద్యులు వైకల్య నిర్ధారణ అనంతరం సర్టిఫికెట్లను జారీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వం సదరం సర్టిఫికెట్లకు స్వస్తి పలికింది. ఆ స్థానంలో యూడీఐడీని పొందేందుకు స్వావలంబన్ కార్డు.జీఓవీ.ఇన్ (https://swavlambancard.gov.in) అనే వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. దీంతో దివ్యాంగులు నేరుగా ఇంటి వద్ద నుంచే ఫోన్, ఇంటర్‌నెట్ సెంటర్, మీ సేవా కేంద్రాల నుంచి కార్డు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

సులభతరంగా సేవలు ...

కొత్తగా అందుబాటులోకి తీసుకువచ్చిన యూడీఐడీ పోర్టల్ వల్ల సేవలు చాలా సులభతరం కానున్నాయి. ఇకపై సదరం శిబిరాల కోసం మీ సేవతో పాటు యూడీఐడీ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకున్న వారికి సదరం శిబిరాలకు సంబంధించి ఎప్పుడు హాజరు కావాలనే సమాచారం దివ్యాంగుల ఫోన్ నెంబర్‌కు సంక్షిప్త సందేశం రూపంలో వస్తుంది. దివ్యాంగులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసే సమయంలో ఎలాంటి తప్పులు, అక్షరదోషాలు లేకుండా చూసుకోవాలి. ఇప్పటి వరకు ఐదు రకాల వైకల్యం ఉన్న వారికే మీ సేవ ద్వారా సదరం శిబిరాలకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండేది. ఇక యూడీఐడీ పోర్టల్‌లో 21 రకాల వైకల్యాలను చేర్చారు. తలసేమియా, ఆటిజం, యాసిడ్ బాధితులు, న్యూరో సంబంధిత బాధితులు కూడా సదరం శిబిరాల కోసం యూడీఐడీ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కల్పించారు. సదరం శిబిరంలో వైకల్య నిర్ధారణ పూర్తయిన అనంతరం సర్టిఫికెట్లను స్మార్ట్ కార్డు రూపంలో పోస్టల్ శాఖ ద్వారా ఇంటికే పంపించనున్నారు. ఈ కార్డు ద్వారా చేయూత పింఛన్లతో పాటు ఇతర పలు సంక్షేమ ప్రయోజనాలకు దేశ వ్యాప్తంగా చెల్లుబాటు కానుంది. యూనిక్ డిజేబులిటీ ఐడీ కార్డులను ఆన్‌లైన్ నుంచే డౌన్‌లోడ్ చేసుకునే అవకాశాన్ని కేంద్రం కల్పించింది. ఇప్పటి వరకు ఉన్న సదరం సర్టిఫికెట్లు మన రాష్ట్రంలో మాత్రమే చెల్లుబాటు అయ్యేవి.

ఇలా దరఖాస్తు చేసుకోండి ...

ఆన్‌లైన్‌లో స్వాలంబన్‌కార్డు.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలి. అప్లయ్ బటన్‌పై క్లిక్ చేసి దరఖాస్తు ప్రక్రియకు సంబంధించి కొన్ని సూచనలు ఉంటాయి. వాటిని పూర్తిగా చదివి అర్థం చేసుకొని తరువాత అంగీకరిస్తు సబ్‌మిట్ క్లిక్ చేస్తే దరఖాస్తు ఫారం ఓపెన్ అవుతుంది. దివ్యాంగులు వారికి చెందిన పూర్తి సమాచారాన్ని అక్కడ అడిగిన విధంగా నమోదు చేస్తే దరఖాస్తు ప్రక్రియ పూర్తి అవుతుంది. వైద్య పరీక్షల అనంతరం వెబ్‌సైట్‌లో అర్జీల స్టేటస్‌ను నిత్యం పరిశీలించుకోవచ్చు.

శాశ్వత ఐడీ తప్పనిసరి



దివ్యాంగులకు ఇప్పటి వరకు సదరం సర్టిఫికెట్లు జారీ చేసేవారు. అయితే ఇకపై శాశ్వతంగా ఆధార్ కార్డు తరహాలో కేంద్ర ప్రభుత్వం యూడీఐడీను ప్రవేశపెట్టింది. దివ్యాంగులకు రానున్న రోజుల్లో ప్రభుత్వం నుంచి ఎలాంటి సంక్షేమ పథకాలు అందాలన్నా ఈ కార్డు తప్పనిసరి కానుంది. దివ్యాంగులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకొని ఈ కార్డును పొందితే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.
– రయిస్ ఫాతిమా, ఏడీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ